ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 12 ఆగస్టు 2024



టెండర్ల మాయాజాలం

నీటి సరఫరా, యూజీడీ నిర్వహణకు టెండర్లు పిలిచిన జీవీఎంసీ

- 30-40 శాతం లెస్‌కు కాంట్రాక్టర్ల బిడ్లు అంత తక్కువకు కోట్ చేయడంపై అనుమానాలు
- ఇంజనీరింగ్ విభాగంపై నిత్యం అవినీతి ఆరోపణలు

- 5లో

రియల్టర్ల ఇష్టారాజ్యం

జిల్లాలో ఎక్కడికక్కడ వెలుస్తున్న అనధికార లేఅవుట్లు

- గత వైసీపీ పాలనలో చక్రం తిప్పిన ఆ పార్టీ నాయకులు
- ఫిర్యాదులు అందినా పట్టించుకోని అధికారులు
- రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మొక్కుబడిగా నోటీసులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అనధికార లేఅవుట్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. జాతీయ రహదారిని ఆనుకొని వున్న అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాలతో పాటు గ్రామీణ నేపథ్యం వున్న నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు కూడా సహకరించడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు.



జాతీయ రహదారి సమీపంలో అనకాపల్లి ఆవఖండం భూముల్లో అనుమతి లేని లేఅవుట్

జిల్లాలో ఇటీవల కూటమి ప్రభుత్వం వివరాలు సేకరించగా 500లకు పైగా అనధికార లేఅవుట్లు ఉన్నట్టు తేలింది. కొందరు గ్రామ పంచాయతీల్లో కూడా కనీసం అనుమతులు పొందకుండానే లేఅవుట్లు వేసి స్థలాలను విక్రయిస్తున్నారు. అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, మునిసిపాలిటీల అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నోటీసులు జారీ చేసినా ఆ వివరాలు కూడా బయటకు చెప్పడం లేదు. మొక్కుబడిగా కొంతమేర జరిమానా విధించి వదిలేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనకాపల్లి నియోజకవర్గం బయ్యవరం రెవెన్యూ పరిధి విస్సన్నపేటలో మాజీ మంత్రి అనుచరులు భారీ లేఅవుట్ వేశారు. కనీసం గ్రామ పంచాయతీ, వీఎంఆర్‌డీఏ అనుమతులు పొందకుండానే నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌లో రోడ్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. అలాగే అనకాపల్లిలో కొండకొప్పాక రైల్వే బ్రిడ్జికి సమీపంలో వైసీపీకి చెందిన ఒక నేత అండదండలతో రియల్టర్లు భారీ వెంచర్ వేస్తున్నారు. ఆవఖండం భూములు నివాసయోగ్యం కావని, భారీ వర్షాలు కురిస్తే ఈ ప్రాంతం నీటిలో మునిగిపోతుందని గతంలో పర్యావరణ శాఖ అనుమతులు ఇవ్వలేదు. కానీ గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు అవేమీ పట్టించుకోకుండా ఆవఖండం భూముల్లో అనధికార లేఅవుట్లు వేసుకొనేందుకు రియల్టర్లకు దొడ్డిదారిన అనుమతులు జారీ చేయించేశారు. కొండకొప్పాక జాతీయ రహదారి నుంచి నాగులాపల్లి కూడలి వరకు ఆవఖండం భూముల్లో యథేచ్ఛగా అనుమతులు లేని లేఅవుట్లు వెలుస్తున్నాయి. నిబంధనల ప్రకారం లేఅవుట్ వేసిన రియల్టర్లు మొత్తం లేఅవుట్ విస్తీర్ణంలో 5 శాతం భూమిని సామాజిక అవసరాల కోసం వదిలేసి, మిగిలిన ప్రాంతంలో 40 అడుగుల రోడ్లు వేసి ప్లాట్‌లు వేయాల్సి ఉండగా అవేమీ పట్టించుకోకుండా దర్జాగా వెంచర్లు వేస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని వున్న అనకాపల్లి మండలం కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావు పేట మండలాల్లో అనధికార లేఅవుట్లు పదుల సంఖ్యలో వేశారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజక వర్గాల్లో పలు మండలాల్లో అనధికార లేఅవుట్లు వెలిశాయి. దేవరాపల్లి, కె.కోటపాడు ప్రాంతాల్లో బడా రియల్ ఎస్టేట్ సంస్థలు వందలాది ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేసి తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి.



కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూలోని విస్సన్నపేటలో లేఅవుట్

నాలా కన్వర్షన్ లేకుండానే..

జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్ల దందా కొనసాగుతున్నా గ్రామ పంచాయతీ, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఒక రియల్టరు లేఅవుట్ వేయాలంటే రైతుల వద్ద నుంచి సేకరించిన భూమికి మార్కెట్ విలువ ప్రకారం 5 శాతం నాలా (ల్యాండ్ కన్వర్షన్ ఫీజు) ప్రభుత్వ ఖజానాకు చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ అనుమతి పొందిన తరువాతే వ్యవసాయ భూమి ఇతర అవసరాలకు వినియోగించాల్సి ఉంటుంది. కానీ రియల్టర్లు నాలా చెల్లించకుండా పది సెంట్లు, ఐదు సెంట్లు బిట్లుగా హద్దులు నిర్ణయించి అమ్మకాలు జరుపుతున్నారు. కన్వర్షన్ లేని భూమి ధర కాస్త తక్కువగా ఉండడంతో కొనుగోలుదారులు ఎగబడి మరీ ప్లాట్‌లు కొనుగోలు చేసి మోసపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో అయితే పంచాయతీలకు పైసా చెల్లించకుండానే ఎకరా నుంచి 5 ఎకరాల లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలు విక్రయిస్తున్నారు. వీటిని పట్టాదారు ... మిగతా 6వ పేజీలో

సంపద కేంద్రాల దశ తిరిగేనా?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రాల నిర్మాణం

- ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన వైనం
- తుప్పు పట్టి నిరుపయోగంగా యంత్రాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన కేంద్రాలు
- నిర్వహణపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం
- అందుబాటులోకి తేవడానికి చర్యలు



తుమ్మపాలలో వృథాగా ఉన్న సంపద కేంద్రం

తుమ్మపాల, ఆగస్టు 11:

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కేంద్రాలను గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రాలు వృథాగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక వాటి నిర్వహణపై దృష్టి పెట్టింది. వాటిని అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టింది.



తుమ్మపాల పంచాయతీ కార్యాలయంలో మూలకు చేరిన చెత్తను పొడి చేసే యంత్రం

గత టీడీపీ ప్రభుత్వం అనకాపల్లి మండలానికి 25 సంపద కేంద్రాలను మంజూరు చేసింది. జనాభా ప్రతిపాదికన తుమ్మపాల, సత్యనారాయణపురం, కూండ్రం పంచాయతీలకు రూ.ఐదు లక్షలు మంజూరు చేసి భారీ సంపద కేంద్రాలు నిర్మించింది. మిగతా చోట్ల రూ.3 లక్షలు చొప్పున కేటాయించి నిర్మాణాలు పూర్తి చేసింది. వీటి నిర్వహణలో భాగస్వాములను చేస్తూ 116 మంది క్లాప్ మిత్రలను కూడా విధుల్లోకి తీసుకుంది. దాదాపు అన్ని పంచాయతీల అధికారులకు సంపద కేంద్రాల నిర్వహణపై తర్ఫీదు కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. అయితే ప్రభుత్వం మారి వైసీపీ అధికారం చేపట్టడంతో సంపద కేంద్రాల కథ ముగిసినట్టయింది. సంపద కేంద్రాల నిర్మాణాలు పూర్తయినా కనీసం వాటి వైపు వైసీపీ ప్రభుత్వం ... మిగతా 6వ పేజీలో

శత శాతం అందుబాటులోకి తీసుకువస్తాం

అక్టోబరు రెండో తేదీ నాటికి సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తాం. దీనికి సంబంధించి అధికారికంగా ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. దశలవారీగా కేంద్రాలను ప్రారంభించి గాంధీ జయంతి నాటికి శతశాతం సంపద కేంద్రాల నిర్వహణను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. శిథిలావస్థకు చేరుకుంటున్న సంపద కేంద్రాలను గుర్తించి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తాం. అలాగే సంపద కేంద్రాల వద్ద జరిగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. సంపద కేంద్రాల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు కట్టుబడి ఉన్నాం.

\- శిరీషారాణి, జిల్లా పంచాయతీ అధికారిణి

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీకి కూటమి సై

తెరపైకి బైరా దిలీప్ చక్రవర్తి పేరు

- నేడు అభ్యర్థి పేరు అధికారికంగా ప్రకటన?

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఉప ఎన్నికలో పోటీ చేయాలని కూటమి నేతలు నిర్ణయించారు. అభ్యర్థిత్వం విషయానికి వస్తే అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశించిన బైరా దిలీప్ చక్రవర్తి పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్లకు ఈనెల 13వ తేదీతో గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నంలోపు అధికారికంగా అభ్యర్థి పేరు ప్రకటించాలని కూటమి నేతలు భావిస్తున్నారు.

ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన కూటమి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ విశాఖ అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, తదితరులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేయాలని నేతలంతా నిర్ణయించారు. పోటీకి సుముఖంగా ఉన్న పీలా గోవింద, గండి బాబ్జీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బైరా దిలీప్ పేరు చర్చకు వచ్చింది. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు పల్లా శ్రీనివాసరావుకు నివేదించారు. ఉమ్మడి జిల్లాలో మిగిలిన సీనియర్ నేతలతో ఒకసారి చర్చించిన మీదట సోమవారం అభ్యర్థి పేరును ప్రకటిస్తామని టీడీపీ నేత ఒకరు తెలిపారు.

విభాగాలపై విచారణ

ఫిర్యాదులు, ఆరోపణలపై పరిశీలనకు ఏయూలో ప్రత్యేక కమిటీ నియామకం

- 5లో

నిర్లక్ష్యం తాండవం!

- పూడుకుపోయిన కాలువలు
- మరమ్మతులకు గురైన గేట్లు
- సాగునీరు అందక రైతుల గగ్గోలు

తాండవ రిజర్వాయర్ నిర్వహణను పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

నాతవరం, ఆగస్టు 11:

తాండవ కుడి, ఎడమ కాలువలు తుప్పలతో పూడుకుపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి వనరులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రెండేళ్ల నుంచి కాలువల్లో పూడిక తీయించలేదు. దీంతో సాగునీరు అందక ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



పారుపల్లి వారి పాకల వద్ద మరమ్మతులకు గురైన గేట్లు



తాండవ రిజర్వాయర్

తాండవ రిజర్వాయర్ ద్వారా అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం తాండవ రిజర్వాయర్ కాలువల నిర్వహణను పట్టించుకోకపోవడంతో కాలువలు పూడుకుపోయాయి. ఆనకట్ట తలుపులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వరి పంట పొట్ట దశకు వచ్చినప్పుడు చివరి భూములకు సాగునీరు అందకపోవడంతో తాండవ ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే కాలువల నుంచి పిల్ల కాలువలకు, అక్కడ నుంచి పంట పొలాలకు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తలుపులు పూర్తిగా పాడైపోయాయి. దీంతో సాగునీరు వృథాగా పోతోంది. గతంలో సుమారు 40 మంది లష్కర్లు(సిబ్బంది) రోజూ కాలువల వెంబడి తిరిగి ప్రధాన కాలువల నుంచి పిల్ల కాలువలకు రైతులకు ఎంతమేర అవసరమో అంతే నీటిని విడుదల చేసేవారు. అలాగే వర్షాలు పడేటప్పుడు ప్రధాన కుడి, ఎడమ కాలువలు ఎక్కడ గండి పడే అవకాశం ఉందో ముందే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ముందు జాగ్రత్తలు తీసుకునేవారు. ప్రస్తుతం 11 మంది లష్కర్లు మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా అందరూ పదవీ విరమణ పొందారు. అలాగే కాలువల వెంబడి అడవులను తలపించే విధంగా పిచ్చి మొక్కలు పెరగడం ద్విచక్ర వాహనాలు కూడా తిరగడానికి వీలులేకుండా ఉంది. అలాగే మూడేళ్ల నుంచి తాండవ మెయిన్ గేట్ల నుంచి నీరు లీకేజీ రూపంలో వృథాగా పోతున్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని తాండవ ఆయకట్టు రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయించడంతో పాటు కాలువల్లో పూడికలు తీయించాలని రైతులు కోరుతున్నారు.



పూడుకుపోయిన తాండవ ఎడమ కాలువ

బొర్రా గుహల అందాలకు ఫిదా

- సందర్శించిన కలెక్టర్ దంపతులు



బొర్రా గుహల అందాలను పిల్లలతో కలిసి తిలకిస్తున్న కలెక్టర్ దంపతులు

ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను దంపతులైన అల్లూరి, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు ఏఎస్ దినేశ్‌కుమార్, విజయకృష్ణన్ తమ ఇద్దరు పిల్లలతో ఆదివారం సందర్శించారు. బొర్రా గుహల అందాలకు వారు ఫిదా అయ్యారు. గుహల చరిత్రను గైడ్స్‌ను అడిగి తెలుసుకున్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన గుహల్లో ఏర్పాటు చేసిన లైటింగ్ బాగుందని కితాబు ఇచ్చారు. అనంతరం అరకులోయ గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. గిరిజనుల జీవన విధానం, ఆభరణాలు, వేట సాధనాలు, వంటగది ఉపకరణాలు, రోజువారీ ఉపయోగించే వస్తువులను ఆసక్తిగా తిలకించారు. - అనంతగిరి/అరకులోయ

మెనూ పాటించరు.. ప్రశ్నిస్తే వేధిస్తున్నారు

అన్నవరం బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినుల ఆందోళన

- మరుగుదొడ్ల క్లీనింగ్, మేట్రిన్ ఇంటి పనులు చేయిస్తున్నారని ఆరోపణ
- హాస్టల్ సిబ్బంది తీరుపై ధ్వజం

చోడవరం, ఆగస్టు 11:

వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోవడంతో పాటు హాస్టల్ సిబ్బంది తమతో వంట, ఇంటి పనులు చేయిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం పట్టణ శివారు అన్నవరం బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులు సీఐటీయూ ఆధ్వర్యంలో హాస్టల్ వద్ద ఆందోళన చేపట్టారు. హాస్టల్‌లో తమకు సక్రమంగా భోజనాలు పెట్టడం లేదని, అదేమని అడిగితే మేట్రిన్‌తో పాటు సిబ్బంది కూడా తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ తమలో కొంతమంది విద్యార్థినులు వంట తయారీలో పని వాళ్లకు సాయం చేయవలసి వస్తున్నదని, దీని వల్ల తమకు స్కూల్‌లో ఆలస్యం కారణంగా ఆబ్సెంట్లు పడుతున్నాయని విద్యార్థినులు వాపోయారు. ఎవరైనా సిబ్బందిని గట్టిగా ప్రశ్నిస్తే తమ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు. హాస్టల్‌లో మరుగుదొడ్లతో పాటు వాటర్ ట్యాంకులు కూడా తామే క్లీనింగ్ చేయవలసి వస్తున్నదని, మేట్రిన్ ఇంటి పనులకు సైతం తమలో కొందరిని పంపుతున్నారని వాపోయారు. ఆందోళన చేపట్టిన విద్యార్థినులు హాస్టల్ సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ చదువుకోవడానికి పిల్లలను హాస్టల్‌కు పంపిస్తే సిబ్బంది వారితో పనులు చేయించడం దారుణమన్నారు. విద్యార్థినులకు పెట్టే భోజనాలలో కూడా మెనూ అమలు కావడం లేదని మేట్రిన్‌తో పాటు, సిబ్బందిపైనా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్వీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పెట్టిన భోజనం



హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

టెండర్ల మాయాజాలం

- నీటి సరఫరా, యూజీడీ నిర్వహణకు టెండర్లు పిలిచిన జీవీఎంసీ
- 30-40 శాతం లెస్‌కు కాంట్రాక్టర్ల బిడ్లు
- అంత తక్కువకు కోట్ చేయడంపై అనుమానాలు
- అధికారులు అంచనాలు పెంచి టెండర్లు పిలుస్తున్నారా?.., లేక కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేయాలనుకుంటున్నారా?
- ఇంజనీరింగ్ విభాగంపై నిత్యం అవినీతి ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ టెండర్లలో ఏదో మాయాజలం జరుగుతోంది. ఇంజనీరింగ్ అధికారులు అంచనాలను తయారుచేసి టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ఆ మొత్తంలో 40 శాతం తక్కువకు పనులు చేసేందుకు సిద్ధమంటూ బిడ్‌లు దాఖలు చేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు పెంచి టెండర్లు పిలుస్తున్నారా? లేక కాంట్రాక్టర్లు పనులు తూతూమంత్రంగా చేసి బిల్లులు చేసుకోవాలనుంటున్నారా?...అనే విషయం అంతుబట్టడం లేదు.

నగరంలో నీటి సరఫరా, భూగర్భ మురుగునీటి వ్యవస్థ బాధ్యతలను ఇంజనీరింగ్ విభాగంలోని ఒక సెక్షన్ పర్యవేక్షిస్తుంది. దీనికి ప్రత్యేకంగా ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో పెద్ద యంత్రాంగమే పనిచేస్తుంది. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు, ఎక్కడైనా పైప్‌లైన్‌లు పాడైపోతే కొత్తవి ఏర్పాటుచేయడం, లీకేజీలు ఏర్పడితే వాటిని సకాలంలో సరిచేయడంతో పాటు యూజీడీ ఎక్కడైనా పొంగితే సమస్య పరిష్కరించేందుకు జీవీఎంసీ ఏటా రూ.250 కోట్లు ఖర్చు చేస్తుంది. జోన్‌ల వారీగా నీటి సరఫరా పైప్‌లైన్ల నిర్వహణకు, యూజీడీ నెట్‌వర్క్ నిర్వహణకు టెండర్లు పిలుస్తుంది. ఏడాదిపాటు ఆయా పనులు చేపట్టేలా ఇటీవల దాదాపు రూ.12.5 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. దీనికి కొంతమంది కాంట్రాక్టర్లు ఏకంగా 30-40 శాతం వరకూ తక్కువకు బిడ్‌లు దాఖలు చేశారు. ఎవరు ఎక్కువ తక్కువకు బిడ్ వేస్తే వారికి పనులను అప్పగించాల్సి ఉంటుంది కాబట్టి ఇంజనీరింగ్ అధికారులు వారితో అగ్రిమెంట్‌లు పూర్తిచేసుకునే పనిలో ఉన్నారు. ఇదిలావుంటే ఏదైనా ఒక పని చేయాలని ఇంజనీరింగ్ అధికారులు భావించినప్పుడు ముందుగా అందుకు అవసరమైన పరికరాలు, కూలీల ఖర్చు వంటి వాటిని స్టాండర్డ్ రేటు (ఎస్‌ఆర్) ప్రకారం లెక్కించి అంచనాలు తయారుచేస్తారు. దీనిని ఏఈ స్థాయి అధికారి పరిశీలించిన తర్వాత డీఈకి పంపిస్తారు. అక్కడ డీఈ, ఈఈ స్థాయి అధికారులు స్క్రూట్నీ చేసి అంచనాలన్నీ ఎస్‌ఆర్ రేటుకు అనుగుణంగా ఉన్నాయా?, లేదా? అనేది పరిశీలించి టెండర్ పిలవడానికి ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఉన్నతాధికారుల ఆమోదంతో ఆయా పనులకు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పిలుస్తారు. టెండర్ మొత్తంలోనే కాంట్రాక్టర్ ప్రాఫిట్ కింద 13 శాతం, జీఎస్‌టీ కింద 18 శాతం కలిసి ఉంటుంది. టెండర్ దక్కించుకోవాలని తాపత్రయపడేవారు తమకు వచ్చే ప్రాఫిట్‌లో ఎంతోకొంత తగ్గించుకుని బిడ్ దాఖలుచేయడం సాధారణంగా జరుగుతుంది. అంటే కాంట్రాక్టర్ ప్రాఫిట్‌గా పేర్కొన్న 13 శాతం మేరకు గరిష్ఠంగా తగ్గించుకోవాల్సి ఉంటుంది. అంతకంటే లెస్‌కు బిడ్ వేస్తే కాంట్రాక్టర్ నష్టపోవడం ఖాయం. కానీ జీవీఎంసీలో మాత్రం దీనికి విరుద్ధంగా టెండరు ప్రక్రియ జరుగుతుండడం సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

40 శాతం వరకూ తక్కువకు టెండర్లు

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో టెండర్లను కొంతమంది కాంట్రాక్టర్లు ఏకంగా 40 శాతం లెస్‌కు బిడ్ వేసి దక్కించుకుంటుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఇంజనీరింగ్ అధికారులు టెండర్ పిలిచారు. దీనిని ఏకంగా 40 శాతం తక్కువకు టెండర్ వేసి ఒక కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు ఆ టెండర్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా యూజీడీ, నీటి సరఫరా నిర్వహణకు కొన్ని టెండర్లు పిలిచారు. వీటిలో ఆరు వర్కులను కొంతమంది కాంట్రాక్టర్లు 30 శాతం లెస్‌కు టెండర్ వేసి దక్కించుకోవడంతో మిగిలిన కాంట్రాక్టర్లు అవాక్కయ్యారు. 30 శాతం లెస్‌తోపాటు 18 శాతం జీఎస్‌టీ పోతే మిగిలిన 52 శాతం మొత్తంతో 100 శాతం పనులు ఎలా పూర్తిచేస్తారంటూ ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఆ పనులను పూర్తిస్థాయిలో చేయకుండా అధికారులను మేనేజ్ చేసుకుంటారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. టెండర్ విలువలో సగం మొత్తానికే పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకువస్తున్నారంటే అధికారులు తయారుచేసిన అంచనాలను భారీగా పెంచేసి ఉండాలని, లేదంటే కాంట్రాక్టర్లు సగం పనులు చేసి బిల్లులు తీసుకునేందుకు లోపాయికారీగా ఒప్పందం చేసుకుని ఉంటారని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ స్వయంగా దృష్టిసారించి, ఇంజనీరింగ్ విభాగంలోని టెండర్ల ప్రక్రియను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

రైళ్లు ఆలస్యం

- రీ షెడ్యూల్‌తో హౌరా-చెన్నై మెయిల్ ఎక్స్‌ప్రెస్ లేటు
- మూడు గంటలు ఆలస్యంగా విశాఖ చేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్
- గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర...

విశాఖపట్నం, ఆగస్టు 11:

వివిధ రైల్వే డివిజన్లలో నిర్మాణ పనులు జరుగుతుండడంతోపాటు లింక్ రేక్ అందుబాటులో లేని కారణంగా పలు రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా నడుస్తున్నాయి. హౌరా-చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12830)ను రీ షెడ్యూల్ చేయడంతో ఆదివారం సుమారు 14 గంటలు ఆలస్యంగా నడిచింది. నిర్దేశిత సమయం ప్రకారం ఈ రైలు శనివారం రాత్రి 11.55 గంటలకు హౌరాలో బయలుదేరాల్సి ఉండగా, లింక్ రేక్ అందుబాటులో లేకపోవడంతో ఆదివారం సాయంత్రం 4.12 గంటలకు బయలుదేరింది. అలాగే హౌరా-తిరుపతి హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (20889) శనివారం హౌరాలో రెండు గంటల 48 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ఆదివారం తెల్లవారుజామున 2.00 గంటలకు విశాఖ స్టేషన్‌కు చేరాల్సిన ఈ రైలు ఉదయం 5.00 గంటలకు వచ్చింది. ఇక హౌరా-ఎర్నాకులం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ శనివారం హౌరాలో మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ఆదివారం ఉదయం 4.45 గంటలకు దువ్వాడ స్టేషన్‌కు చేరాల్సిన ఈ రైలు 7.55 గంటలకు చేరింది.

మూడు గంటలు ఆలస్యంగా చేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) ఆదివారం ఉదయం మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. షెడ్యూల్ ప్రకారం శనివారం సాయంత్రం 5.05 గంటలకు బయలుదేరి...రాత్రి 10.50 గంటలకు విజయవాడ స్టేషన్‌కు రావాల్సి ఉండగా...అర్ధరాత్రి 12.00 గంటలకు చేరింది. సోమవారం ఉదయం 5.45 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా, ఉదయం 9.00 గంటలకు వచ్చింది. అలాగే శనివారం దాదాపు నిర్దేశిత సమయానికి సికింద్రాబాద్‌లో బయలుదేరిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12740) ఆదివారం ఉదయం సుమారు గంటన్నర ఆలస్యంగా విశాఖ చేరింది. ఉదయం 7.40 గంటలకు రావాల్సి ఉండగా, 9.25 గంటలకు వచ్చింది. ఇక చెన్నై-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) కూడా ఆదివారం సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ఉదయం 7.50 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా...10.10 గంటలకు చేరింది.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

- రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

విశాఖపట్నం, ఆగస్టు 11: గిరిజనులంతా ఐక్యంగా ఉండాలని, అందరూ కలిసి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ఆదివాసీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమం లో ఆమె మాట్లాడారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు కూడా విద్యావంతులు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమాజ స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలని, అన్ని రంగాల్లో ప్రతిభ కనపరిచేలా పిల్లలను తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం వివిధ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే ఎమ్మెల్యే శిరీషాదేవిని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సన్మానించింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

ఎలమంచిలి, ఆగస్టు 11: వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని రైతు బజారు పూర్వ వైభవం కోల్పోయింది. ప్రస్తుతం తుప్పలతో ప్రాంగణం నిండిపోయింది. నియోజకవర్గ కేంద్రంలోని ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించాలనే లక్ష్యంతోపాటు రైతులకు గిట్టుబాటు ధర కోసం 13 ఏళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటు చేసిన రైతు బజారు మూలకు చేరింది. వివరాల్లోకి వెళితే..



తుప్పలు పేరుకుపోయి ఉన్న రైతుబజారు

రైతుబజారుపై నిర్లక్ష్యం నీడ

ప్రారంభించిన అనతికాలానికే మూత

- పునఃప్రారంభానికి చర్యలు తీసుకోని అధికారులు, పాలకులు
- తుప్పలతో నిండిన ప్రాంగణం
- పాడైన కూరగాయల షెడ్లు
- ఎలమంచిలి రైతుబజారు దుస్థితి



రోడ్డు పక్కనే కూరగాయలను విక్రయిస్తున్న రైతులు

ఎలమంచిలి పట్టణానికి ప్రతి రోజూ మండలంలోని రైతులతో పాటు ఎస్.రాయవరం మండల రైతులు తాము పండించిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకువచ్చేవారు. రైతులు తెచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో దళారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో వారు రోడ్లు పక్కనే వాటిని ప్రజలకు నేరుగా విక్రయించడం మొదలు పెట్టారు. దీంతో కొన్ని సందర్భాల్లో దళారులు, రైతులకు మధ్య గొడవలు కూడా జరిగేవి. అలాగే పట్టణ వాసులు కూడా బయట మార్కెట్లో అధిక ధరలకు కూరగాయలు కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఈ సమస్య పరిష్కరించేందుకు అప్పటి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు 2011వ సంవత్సరంలో ఎంపీడీవో కార్యాలయం పక్కన రైతు బజారును ఏర్పాటు చేశారు. రోడ్డుపై విక్రయిస్తున్న రైతులందరికీ రైతుబజారులో అవకాశమిచ్చారు. అలాగే దళారుల చేతిలో మోసపోకుండా తామే విక్రయించుకోవడానికి అవకాశం లభించింది. దీంతో రైతులు సంతోషించారు. అయితే రైతుబజారు ప్రారంభించిన కొంత కాలానికే మూతపడింది. అప్పటి నుంచి రైతు బజారును పునఃప్రారంభించేందుకు పాలకులు గాని, అధికారులు గాని దృష్టి సారించలేదు.

ఏళ్ల తరబడి పునఃప్రారంభానికి నోచుకోకపోవడంతో రైతుబజారులోని షెడ్లు దెబ్బతిన్నాయి. రైతు బజారు ఆవరణంతా తుప్పలు, మొక్కలు విపరీతంగా పెరిగి పోయాయి. గత ఐదేళ్లలో రైతుబజారు పునఃప్రారంభానికి వైసీపీ పాలకులు కనీసం చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన షెడ్లు శిథిల మయ్యే స్థాయికి చేరుకున్నాయి. రైతు బజారులో మొక్కలు, తుప్పలు ఏపుగా పెరగడంతో షెడ్లు కూడా కనిపించకుండా పోతున్నాయి. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా పునఃప్రారంభించాలని రైతులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్సీలకు వినతి

కొత్తూరు, ఆగస్టు 11 : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, బి.హైమారావు, అనకాపల్లి జిల్లా ప్రతినిధులు పి.వి.రమణ, నక్కా శ్రీనుబాబు, దడాల శ్రీదేవి, కాండ్రేగుల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు వారంతా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ ఎన్‌జీవో భవనంలో ప్రభుత్వ సమన్వయ కమిటీ ప్రతినిధులుగా హాజరైన ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు ఏఎస్ రామకృష్ణలకు సమస్యలు వివరించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జీవో నంబరు 29 ప్రకారం చేయాలని, జీవో నంబరు 117, 53లను వెంటనే రద్దు చేసి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడ్ని నియమించాల కోరారు. అలాగే, రాష్ట్ర సమస్యలతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో అనుకోని విధంగా గిరిజన ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెనక్కి తీసుకురావాలని కోరినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవిరావులకు వినతిపత్రం అందజేస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

108 అంబులెన్స్‌లో ప్రసవం

- ఆడ బిడ్డకు జన్మనిచ్చిన కొత్తూరు మహిళ

కొత్తూరు, ఆగస్టు 11 : అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి చెందిన దీపిక అనే మహిళ ఆదివారం 108 అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ముందుగా జరిపిన పరీక్షల్లో వచ్చే నెలలో కాన్పు అవుతుందని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. ఇంతలో ఆది వారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడి వైద్యుల తనిఖీల అనంతరం కడుపులో బిడ్డ బరువు తక్కువగా ఉండడంతో 11.20కి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా మార్గ మధ్యలో పోర్టు ఆసుపత్రి వద్దకు వచ్చేసరికి నొప్పులు మరింత పెరిగాయి. 108 వాహనాన్ని పక్కన ఆపి పురుడు పోశారు. దీపిక మొదటి కాన్పులో ఆడ బిడ్డకు జన్మనిచ్చిందని టెక్నీషియన్ నారాయణ, ఆశ కార్యకర్త, పైలెట్ తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు.



ఆడ బిడ్డకు జన్మనిచ్చిన దీపిక

కమనీయం అప్పన్న కల్యాణం



సింహాచలం, ఆగస్టు 11 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

21న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్

- విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ గౌరవాధ్యక్షులు కృష్ణస్వరూప్ పిలుపు

పాయకరావుపేట, ఆగస్టు 11 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన జరిగే భారత్ బంద్‌ను అంతా విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ గౌరవాధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం పాయకరావుపేటలో మాల మృతవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాస్తవాలతో కూడిన ఆందోళన చేపట్టిన ఎంఆర్‌పీఎస్ నేతతో ఆర్‌ఎస్‌ఎస్, ఏన్డీఏ సర్కారు కుట్రలు చేసి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చేశారని ఆరోపించారు. దీని వలన రాష్ట్రంలో అధికంగా ఉన్న మాలలతో పాటు 58 ఎస్సీ ఉప కులాలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా భారత్ బంద్ చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, రాష్ట్ర నాయకురాలు దాసరి అన్నపూర్ణ, దువ్వాడ రాజు, పండాడ కొండబాబు, జి.సతీష్, యాదగిరి, నానాజీ పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

మలుపులతో పొంచి ఉన్న ప్రమాదం

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి

పరవాడ, ఆగస్టు 11 : పట్టణంలోని దీపాంజలినగర్ నుంచి వాడ చీపురుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో గల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా గొల్లపేట వద్ద గల మలుపుతో పాటు వాడచీపురుపల్లి పీహెచ్‌సీ సమీపంలో గల ఎల్ ఆకారంలో గల మలుపు వాహనదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఈ మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పలువురు గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. పీహెచ్‌సీ సమీపంలో గల ఎల్ ఆకారం మలుపు వద్ద గతంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఆటో బోల్తా పడడంతో ఈ దుర్ఘటన జరిగింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆయా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గొల్లపేట సమీపంలో ప్రమాదకరంగా దర్శనమిస్తున్న మలుపు



వాడచీపురుపల్లి పీహెచ్‌సీ సమీపంలో...

వేపాకుల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

- పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం వేపాకుల అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు అమ్మవారిని వేపాకులతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రావణ మాసం భాను సప్తమి సందర్భంగా ఈ అలంకరణ చేపట్టారు. సెలవుదినం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి బాలాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కాటేజీలు, పరిసర ప్రాంతాల్లో కుటుంబాల సమేతంగా వచ్చినవారు వంటలు వండుకుని నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు.



నూకాంబిక అమ్మవారిని వేపాకులతో అలంకరించిన దృశ్యం



నూకాంబికను దర్శించుకుంటున్న భక్తులు

విభాగాలపై విచారణ

- ఫిర్యాదులు, ఆరోపణలపై పరిశీలనకు ఏయూలో ప్రత్యేక కమిటీ
- ఐదుగురు సభ్యులతో ఏర్పాటు
- 19వ తేదీలోగా నివేదిక అందించాలని రిజిస్ట్రార్ ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై విచారణకు ఇన్‌చార్జి వీసీ ప్రొఫె సర్ జి.శశిభూషణ్ ఆదేశాలతో ప్రత్యేక కమిటీని నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహ రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ కె.బసవయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.వెంకటరావు, ఐటీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావులను కమిటీలో సభ్యులుగా నియమించారు. కమిటీ సభ్యులు నిష్పక్ష పాతంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదే శించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్‌ఈ, ఐటీ విభా గాల్లో ప్రథమ సంవత్సరం తరగతుల నిర్వహణ, పర్య వేక్షణ, ఆయా విభాగాల్లో అధ్యాపకుల హాజరు, తదితర అంశాలు, కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాలు, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో హాల్ టికెట్లు మంజూరు చేయడానికి ఫైన్లు రూపంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై ఈ కమిటీ విచారించనుంది. అలాగే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-కంప్యూటర్ అప్లికేషన్స్, జర్నలిజం, ఎకనామిక్స్ విభాగాలకు సంబంధించి బోధన, బోధనేతర సిబ్బందిపై పలు వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఆరోపణలపై కూడా నివేదిక ఇవ్వాలని సూచించారు. కమిటీ సభ్యులు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిన విభాగాల్లో బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది, లేబొరేటరీ సిబ్బంది, విద్యార్థులతో సమావేశమై వివరాలు సేకరించాలని సూచించారు. కమిటీ సభ్యులు ఈ నెల 19వ తేదీలోగా సీల్డ్ కవర్‌లో తమ నివేదికను అందించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఆగస్టు 11: జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన అంతర్జాతీయ అర్హత కలిగిన బ్లూ బ్యాడ్జి అంపైర్ డాక్టర్ డీవీఎస్‌వై శర్మ నియమితులయారు. ఈ మేరకు భారత్ టేబుల్ టెన్నిస్ సమాఖ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల11 నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లోని రైంబో ఖేలో ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలో జరిగే జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న శర్మ ఇప్పటివరకు అనేక అంతర్జాతీయ, జాతీయ టోర్నీలకు అంపైర్‌గా వ్యవహరించారు. అంతేకాకుండా ఎల్‌ఐసీ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబరుగా సేవలందిస్తున్న శర్మ..జాతీయ ర్యాంకింగ్ టోర్నీకి అంపైర్‌గా నియమితులు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



డీవీఎస్‌వై శర్మ

దువ్వాడ మీదుగా నాందేడు, శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఆగస్టు 11: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా నాందేడు, శ్రీకాకుళం రోడ్డు మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 07487 నంబరు గల రైలు ఈనెల 14న మధ్యాహ్నం 2.00 గంటలకు నాందేడులో బయలుదేరి మర్నాడు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07488 నం బరు గల రైలు ఈనెల 15న సాయంత్రం 5.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బ యలుదేరి రాత్రి 7.33 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 3.25 గంటలకు నాందేడు చేరుతుంది. ముద్‌ఖేడ్, ధర్మబాద్, బాసర, నిజామాబాద్, కామరెడ్డి, సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

జనసేన పార్టీలో చేరిన వైసీపీ నాయకులు

▸▸ మునగపాక ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు కండువా కప్పిన ఎమ్మెల్యే సుందరపు



ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న నాయకులు

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 11 : మునగపాక మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ప్రధానంగా ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి, రాజుపేట సర్పంచ్ కిలాడి దేముళ్లు, చెర్లోపాలెం ఉప సర్పంచ్ బోజా వెంకట శ్రీనివాస్‌తో పాటు వార్డు మెంబర్లు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, నాగవరం ఎంపీటీసీ పాలిపిన్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక ఎంపీటీసీ సభ్యుడు...

ఎలమంచిలి : మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాక ఎంపీటీసీ సభ్యుడు నడిరెడ్డి అచ్చియ్యనాయుడు వైసీపీని వీడి ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఇతనికి ఎమెల్యే కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, వైస్ ఎంపీపీ రాజాన శేషు తదితరులు పాల్గొన్నారు.

కట్టుబోలు, మురకాడ పంచాయతీల్లో ఇద్దరు ఎంపీటీసీలు..

రాంబిల్లి : మండలంలోని కట్టుబోలు, మురకాడ పంచాయతీల్లో వైసీపీ చెందిన ఎంపీటీసీ సభ్యులు ఇద్దరు ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే నివాసంలో కట్టుబోలు, మురకాడ ఎంపీటీసీలు జనపరెడ్డి చిన్న, మడగల తాతాజీలకు ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, పప్పల నూకన్న దొర, కొటాపు లక్ష్మి, వడ్డికాసులు తదితరులు పాల్గొన్నారు.

'పేట' పీహెచ్‌సీలో ఆల్ట్రా సౌండ్ స్కానింగ్

▸▸ అందుబాటులోకి వచ్చిన యూనిట్ ▸▸ ఆనందం వ్యక్తం చేస్తున్న గర్భిణులు



పరికరాన్ని చూపుతున్న వైద్యులు

పాయకరావుపేట, ఆగస్టు 11 : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ యూనిట్ రావడంతో గర్భిణులకు మరిన్ని వైద్య సేవలు అందుబాటు లోకి వచ్చాయి. పాయకరావుపేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు పట్టణంలో ఏర్పాటుచేసిన పీహెచ్‌సీని రూ.1.5 కోట్లతో నూతన భవనం, ఆధు నిక సౌకర్యాలతో అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ఈ ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు విధులు నిర్వర్తిస్తుండగా, రోజూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రాథమిక వైద్య సేవలతో పాటు ప్రతి బుధవారం 70 నుంచి 80 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు, ప్రతి నెలా తొమ్మిదో తేదీన గైనకాలజిస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గర్భిణులకు బీపీ, షుగర్ తదితర అన్నిరకాల పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్ తదితర సౌకర్యాలున్నప్పటికీ ఆల్ట్రా స్కానింగ్ పరికరం లేక గర్భిణులు ఇప్పటి వరకు తుని ఏరియా ఆసుపత్రి లేక ప్రవేటు ల్యాబ్‌ల్లో స్కానింగ్ తీయించుకోవాల్సి వచ్చేంది. దీంతో వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. దీనిని గుర్తించిన జిల్లా ఉన్నతాధికారులు ఈపీహెచ్‌సీకి కొత్తగా ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ పరికరాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి కొత్తగా ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ యూనిట్ రావడం వలన గర్భిణులు స్కానింగ్ కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అదేవిధంగా పీహెచ్‌సీలో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల కమిటీ ఎన్నిక



తిమ్మాపురం నూకాంబిక ఆలయంలో సమావేశమైన దివ్యాంగులు

ఎస్.రాయవరం, ఆగస్టు 11 : ఎలమంచిలి నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల సమావేశాన్ని మండలంలోని తిమ్మాపురం నూకాంబిక అమ్మవారి ఆలయం ఆవరణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కో-ఆర్డినేటర్ రాయి తాతయ్యలు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను గాలికి వదిలేయడంతో పాటు సంఘాలను, సమాఖ్యలను నిర్వీర్యం చేసిందన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో దివ్యాంగులకు ఎన్నో పథకాలు అందించేవారన్నారు. మరలా అప్పటి పథకాలను ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పునరుద్ధరించాలని కోరారు. పలువురు దివ్యాంగులు మాట్లాడుతూ ఎటువంటి దివ్యాంగత్వం లేకపోయినా కొందరు అడ్డదారిన ధ్రువీకరణ పత్రాలు పొందారని, ఆటువంటివారి సర్టిఫికెట్లు రద్దు చేయాలన్నారు. అలాగే మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి సంఘాలను పునరుద్ధరించాల్సిందిగా వారు కోరారు. అనంతరం నియోజకవర్గ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కోటవురట్ల మండలం యండపల్లికి చెందిన గుడివాడ వరలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా పెదగుమ్ములూరుకు చెందిన సరసా నాగరాజు, కార్యదర్శిగా కొర్ని సింహాచలం, జాయింట్ సెక్రటరీగా యర్రా శ్రీనివాసరావు, కోశాధికారిగా జి.కాశీరావు, పలువురు దివ్యాంగుల సభ్యులుగా ఎన్నికయ్యారు.

సంపద కేంద్రాల దశ తిరిగేనా?

... 3వ పేజీ తరువాయి

గత ఐదేళ్లలో కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో నిర్మాణాలు పూర్తయిన సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మేజరు పంచాయతీ తుమ్మపాలలో చెత్తను పొడి చేసే యంత్రాలు సైతం మూలకు చేరి తుప్పు పట్టిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం రావడంతో సంపద కేంద్రాలకు ఊపిరి పోసినట్టయింది. నిర్మాణాలు పూర్తయిన సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం మార్టూరు, మామిడిపాలెం, పిసినికాడ, శంకరం పంచాయతీల్లో గల సంపద కేంద్రాలు నిర్వహణలో ఉండగా, మిగతా సంపద కేంద్రాలు కూడా అందుబాటులోకి రానున్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామాలు పరిశుభ్రంగా మారడంతో పాటు చెత్త నుంచి సంపద ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని పంచాయతీ అధికారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రియల్టర్ల ఇష్టారాజ్యం

... 3వ పేజీ తరువాయి

పాస్ పుస్తకాల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

నోటీసులతో సరిపెడుతున్నారు

జిల్లాలో అక్రమ లేఅవుట్ల వ్యవహారంపై ఎవరైనా పంచాయతీ, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదులు చేస్తే సంబంధిత రియల్ వ్యాపారికి ఒక నోటీసు జారీచేసి మమా అనిపిస్తున్నారు. ఇటీవల అనకాపల్లి నియోజకవర్గం బయ్యవరం రెవెన్యూ విస్సన్నపేటలో అక్రమ లేఅవుట్ వ్యవహారాన్ని వీఎంఆర్‌డీఏ అధికారులకు జనసేన నాయకులు ఫిర్యాదు చేస్తే కేవలం నోటీసు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికే ప్లాట్‌ల విక్రయాలు జరిగిపోయినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. కొండకొప్పాక రైల్వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారికి చెందిన సర్వీసు రోడ్డును అనకాపల్లికి చెందిన ఒక రియల్టరు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సుమారు వంద ఎకరాల్లో వేస్తున్న ఈ లేఫుట్‌కు నాలా ఫీజు పైసా చెల్లించలేదని తెలిసింది. ఇదే లేఅవుట్‌లో సింహాద్రి పవర్ ప్రాజెక్టుకు చెందిన హైటెన్షన్ విద్యుత్ టవర్లకు సమీపంలో తీగల కింద నిబంధనలకు విరుద్ధంగా లేఫుట్ పనులు జరుపుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు జిల్లాలో అనధికార లేఅవుట్లపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అద్దె భవనంలో సిబ్బంది.. విధులకు ఇబ్బంది.!

▸▸ నిరుపయోగంగా పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ▸▸ ఐదేళ్ల వైసీపీ హయాంలో పట్టించుకోని పాలకులు

▸▸ కొత్తూరు రిజిస్ట్రేషన్లకు వెళ్లి రావడానికి ప్రజలకు తీవ్ర అవస్థలు

▸▸ రూ.లక్షలు వృథా చేసే కంటే.. సొంత భవనానికి మరమ్మతులు చేపట్టాలని పలువురు సూచన



కొత్తూరులోని అద్దె భవనంలో ప్రస్తుతం ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9: పట్టణం నడిబొడ్డున సుమారు ఐదేళ్ల క్రితం రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారితో కళకళలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పాత భవనం నేడు నిరుపయోగంగా మారింది. కార్యాలయం ఆవరణ అంతా తుప్పలు, చెత్తాచెదారంలో నిండి చిట్టడివిని తలపిస్తుంది. దీంతో కొంతమంది స్థానికులు వ్యర్థాలను భవనానికి ఈశాన్య మార్గంలో వేయడం వల్ల డంపింగ్ యార్డులా తయారైంది. ఏటా లక్షలాది రూపాయలు అద్దె భవనానికి చెల్లించే బదులు, నిధులు కేటాయించి మరమ్మతులు చేయాలన్న కనీస ఆలోచన గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు ఈ భవన స్థానంలో నూతన భవన నిర్మాణానికి అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అయితే రాష్ట్ర విభజనలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని తెలుస్తోంది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ గత ఐదేళ్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణంపై దృష్టిసారించలేదు. కొవిడ్ సమయంలోనే ఈ భవనంలో అధికారుల విధులను ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో గల అద్దె భవనంలోకి మార్చేశారు. అక్కడ రెండేళ్లకు పైగా రిజిస్ట్రేషన్ కార్యాలయం కొనసాగింది. కార్యాలయం మూడో అంతస్తులో ఉండడంతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రదేశాన్ని వదిలేసి ఇక్కడికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్‌లోని జాతీయ రహదారికి ఆనుకుని ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అంతదూరం వ్యవయ ప్రయాసలకోర్చి రిజిస్ట్రేషన్లు చేయించుకునేందు వెళ్లి రావడం కష్టంగా ఉందని వాపోతున్నారు.

మూడు మండలాల రిజిస్ట్రేషన్లు ఇక్కడే..

అనకాపల్లి పట్టణం, రూరల్, కశింకోట, మునగపాక మండలాల వారు ఏ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నా కొత్తూరులోని ఈ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుంది. దీనికితోడు సరైన రవాణా సౌకర్యం కూడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పట్టణ నడిబొడ్డున రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని పలువురు విన్నవించినా కనీసం వైసీపీ పాలనలో ప్రతినిధులు స్పందించలేదని పలువురు వాపోయారు.



తుప్పలు పెరిగి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న భవనం

మరమ్మతులు చేపడితే అందుబాటులోకి!

పట్టణ నడిబొడ్డున తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో విశాలమైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం గతంలో అందరికీ అందుబాటులో ఉండేది. పాత భవనం కావడంతో వర్షాలు పడే సమయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడేవారు. దీంతో అద్దె భవనంలోకి మార్చారు. నెలనెలా వేలాది రూపాయలు అద్దెచెల్లించి ప్రభుత్వ ధనం వృథా చేసేకన్నా ఉన్న భవనానికి నిధులు కేటాయించి మరమ్మతులు చేపడితే బాగుండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా..



భవనం ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు

నిరుపయోగంగా ఉన్న ఈ కార్యాలయం పాత భవనం నేడు మందుబాబులకు అడ్డాగా మారింది. పలువురు అక్కడికి చేరి మద్యాన్ని సేవించడంతో పాటు ఆయా సీసాలను పగులగొడుతున్నారు. రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు పలువురు పాల్పడుతున్నారని ప్రచారంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాత భవనానికి మరమ్మతులు చేపట్టి, లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం వృథాకాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సర్పంచుల ఆత్మీయ సమావేశం

▸▸ భవిష్యత్తు నిర్ణయాలపై కీలకంగా చర్చించినట్టు సమాచారం

▸▸ పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో మళ్లీ వచ్చేవారం నిర్వహణ



సమావేశానికి హాజరైన వివిధ పంచాయతీల సర్పంచులు

తుమ్మపాల, ఆగస్టు 11 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఆదివారం అనకాపల్లి మండల సర్పంచుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. మొత్తం 32 మంది సర్పంచులకు గాను పద్దెనిమిది పంచాయతీల నుంచి హాజరయ్యారు. ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యమైనదిగా పలువురు అభిప్రాయపడుతున్నారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించినట్టు పలువురు సర్పంచ్‌లు చెబుతున్నప్పటికీ దీని వెనుక పలు కీలక నిర్ణయాలు ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కూటమి అధికారంలో ఉండడంతో సర్పంచులంతా ఆ ప్రభుత్వంలో చేరేందుకు సమాలోచనలు చేస్తున్నట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సమావేశానికి హాజరైన సర్పంచ్‌లను వివరణ కోరగా, కేవలం ఇది ఆత్మీయ సమావేశమేనని ఇందులో రాజకీయ కోణం లేదని అంటున్నారు. సర్పంచుల సంఘం ఏర్పాటు చేసుకునేందుకు చర్చించామని, అయితే పూర్తిస్థాయిలో సర్పంచ్‌లు హాజరు కాకపోవడంతో వచ్చే వారానికి సమావేశాన్ని వాయిదా వేసినట్టు చెబుతున్నారు.

బ్రాండిక్స్‌లో 400 మందికి కంటి పరీక్షలు



శిబిరంలో కంటిరోగులకు పరీక్షలు జరుపుతున్న సిబ్బంది

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 11 : సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా బ్రాండిక్స్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దొరస్వామి మాట్లాడుతూ మానవుల అవయువాల్లో అతిప్రధానమైన వాటిలో కన్నుఒకటి అన్నారు. దానిని ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని సూచించారు. ఈ శిబిరానికి 650 మంది హాజరుకాగా, 400 మందికి కంటి పరీక్షలు జరిపారు. యాభై మందిని కాటరాక్టు ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. అలాగే, ఇటీవల నిర్వహించి ఇటువంటి శిబిరంలో 245 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించడంతో వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజన ఫలహారాలను పంపిణీ చేశారు.

1990 పోలీస్ బ్యాచ్ ఆత్మీయ కలయిక



తుమ్మపాలలో కలుసుకున్న బ్యాచ్ పోలీసు సిబ్బంది

తుమ్మపాల, ఆగస్టు 11 : అనకాపల్లి మండలం తుమ్మపాలలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం 1990 పోలీస్ బ్యాచ్ ఆత్మీయ సమావేశం ఏర్పాటైంది. ఆ సంవత్సరంలో ఎంపికై శిక్షణ పొందినవారంతా ఓచోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ బ్యాచ్‌లో అశువులు బాసిన పోలీసులకు నివాళులర్పించారు. అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఇకపై ఏటా ఇలాగే కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మగంటి అనిల్, కార్యదర్శులు ఎస్.సాయి బాబారాజు, వెంకటేశ్వర్లు, సుబ్బరాజు, ముబారక్, బోని శ్రీనివాస్, లక్ష్మణరావు, పూర్ణ, నరసింగరావు, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో విరబూసిన బ్రహ్మకమలాలు



జలాలు వీధిలో పూసిన పూలు

ఎలమంచిలి, ఆగస్టు 11 : పట్టణంలో ఓ ఇంట బ్రహ్మకమలాలు వికసించాయి. జలాలు వీధిలో నివాసం ఉంటున్న బ్యాంకు మాజీ మేనేజర్ పోలిశెట్టి ఆంజనేయులు తన ఇంట్లో ఈ మొక్కను పెంచుతున్నారు. శనివారం రాత్రి ఈ మొక్కకు ఒకేసారి నాలుగు పుష్పాలు పూయడంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధులు లేవు. ఇది తెలుసుకున్న పరిసరాలవారు ఆసక్తిగా తిలకించారు.

క్రికెట్ అకాడమీ ప్రారంభం



క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న రాంకీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 : ఇక్కడి జాతీయ రహదారిలోని కాకతాంబనగర్‌లో ఎస్‌వీఎల్ క్రికెట్ అకాడమీ ఆదివారం ప్రారంభమైంది. జనసేన నాయకుడు భీమరశెట్టి రాంకీ ఈ అకాడమీని ప్రారంభించారు. ఇందులో శిక్షణ పొందేందుకు వచ్చిన క్రీడాకారులతో రాంకీ మాట్లాడుతూ క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తు పొందాలని కాంక్షించారు. అకాడమీ వ్యవస్థాపకులు ఆడారి సతీష్, భవ్యశ్రీ డవలపర్స్ అధినేత కాండ్రేగుల నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రి మహాలక్ష్మినాయుడు, రవి, బుద్ద శ్రీను, కర్రి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంకీని అకాడమి ప్రతినిధులు సత్కరించారు.

రక్షణ కోరతూ మత్స్యకార నాయకుడు వినతి

పాయకరావుపేట, ఆగస్టు 11 : మత్స్యకార నాయకుడిగా తమ సామాజికవర్గానికి చెందినవారి సమస్యలపై పోరాడుతున్న తనకు కొంతమంది నుంచి ప్రాణ భయం ఉన్నందున రక్షణ కల్పించాలని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నానని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారమిక్కడ మాట్లాడుతూ జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర నాయకుడిగా తాను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ మత్స్యకార సమస్యలపై జాతీయ నాయకులను కలుస్తున్నానన్నారు. ఈ క్రమంలో కొంతమంది తనపై కక్ష పెంచుకున్నందున తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు

15న తానాంలో మెగా రక్తదాన శిబిరం

పరవాడ, ఆగస్టు 11 : తానాం గ్రామంలో ఈనెల 15న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కన్నూరి యువసేన ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన యువత అధికసంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తామని వెల్లడించారు.

సామ్రాట్ కుమార్‌కు అవార్డు ప్రదానం



సామ్రాట్‌కుమార్‌ను సత్కరిస్తున్న అతిథులు

సబ్బవరం, ఆగస్టు 11 : మండలంలోని అమృతపురం గ్రామానికి చెందిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొటివాడ సామ్రాట్ కుమార్‌కు అంబేడ్కర్ సేవారత్న అవార్డు లభించింది. ఈ మేరకు విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనా రాయణ అవార్డు అందజేసి సత్కరించారు. ప్రతిభ క్రీడా, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనుబాబు, ఆదినారాయణ, చెంగల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎలియన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అనకాపల్లి శాఖ ప్రారంభం



ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 : పట్టణంలో ఆదివారం ఎలియన్స్ ఇంటర్నేషనల్ మెయిన్‌క్లబ్ అనకాపల్లి శాఖ ప్రారంభమైంది. తొలుత సమావేశమైన సభ్యులంతా కలిసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వైస్ గవర్నర్ అల్లూరి ఉషారాణి ఈ నూతన క్లబ్‌ను ప్రారంభించారు. అధ్యక్షులుగా కడిమిశెట్టి వీవీ స్వామి, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, పీఎస్‌వీ రవికుమార్, కార్యదర్శిగా కేవీ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా పి.శంకర్ కోశాధికారిగా వీఎస్‌కే హరనాథ్‌తో పాటు మరో 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఇంటర్నేషనల్ ఆఫీసర్ బి.తిరుపతి రాజు కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎం.విశ్వేశ్వరరావు, ఎస్.మహేశ్వరరావు, కె.రాజేశ్వరరావు, కడిమిశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'స్పందన' చేయూత



బాధితుడికి చెక్కు అందిస్తున్న సీఐ, సంస్థ సభ్యులు

నక్కపల్లి, ఆగస్టు 11 : మండల కేంద్రం నక్కపల్లి సమీపంలో గత ఏడాది మే 10వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడ్ని పోగొట్టుకుని, కుటుంబంతో సహా తీవ్ర గాయాలకు గురై ప్రస్తుతం లేవలేని స్థితిలో ఉన్న బాధిత కుటుంబానికి విశాఖ స్పందన చేయూత ఫౌండేషన్ సంస్థ బాసటగా నిలిచింది. ఈ మేరకు ఆదివారం ఆ కుటుంబానికి సరకులతో పాటు రూ.36,500 చెక్కు అందజేసింది. నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్, లయన్ ఆలపాటి సుబ్బారావు, ఫౌండేషన్ చైర్మన్ బుచ్చిరాజు, శివాజీ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

కొత్తూరు, ఆగస్టు 11 : ద్విచక్ర వాహనంపై వంద మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి మండలం కొప్పాక గ్రామ కూడలి వద్ద శనివారం సాయంత్రం ముందస్తు సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇంతలో రావికమతం మండలానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఒక సంచిలో వంద మద్యం క్వార్టర్ బాటిళ్ల తరలిస్తుంగా గురించి పట్టుకున్నట్టు చెప్పారు. అనంతరం అతనిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ కార్యవర్గం

ఎలమంచిలి, ఆగస్టు 11 : ఎలమంచిలి ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆరవ సర్వసభ్య సమావేశం ఆదివారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ అధ్యక్షుడు ఎం.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్.ఠాగూర్, ట్రెజరర్ త్రిమూర్తులు మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లాలం అప్పాజీ, కార్యదర్శిగా తుంపాల శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా జేవీసీ శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా మారిశెట్టి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా ఆర్‌వీఈఎస్ఎన్ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆర్.ఎస్.నాగేశ్వరరావు, శానాపతి అప్పారావు, గొర్ల రామజోగి, పెయ్యల రామకృష్ణ కర్రి శ్రీను, బి.వెంకట్రావు, ఆదినారాయణ, జి.సత్యారావు, రామకృష్ణలతో పాటు పెద్ద సంఖ్యలో ఏజెంట్లు పాల్గొన్నారు.

టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ

▸▸ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రారంభం



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

కశింకోట, ఆగస్టు 11 : తాళ్లపాలెం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఆదివారం ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. అనకాపల్లి జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు హాజరై ప్రారంభించారు. సుమారు నలభై రోజుల పాటు జరగనున్న ఈ శిక్షణలో మహిళలు పూర్తి నైపుణ్యం పొంది ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఇప్పటికే 30మంది పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపార. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి అన్నం శివరాజశేఖర్, సేవాదళ్ కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యస్వామి, శిక్షకులు నాగమణి, హేమ, కన్వీనర్ డాక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తూ సాగిపోతున్న ఎడ్లబండ్లు

బండెనక బండి కట్టి.. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

కృష్ణాదేవిపేట, ఆగస్టు 11 : గొలుగొండ-కొయ్యూరు మండలాల సరిహద్దుల్లో గల బొడ్డేరుగెడ్డ, వాగుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. దీని గురించి అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ఇసుక రవాణా 'మూడుపువ్వులు.. ఆరు కాయలు'గా సాగుతోంది. మండలంలోని కొంగసింగి, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, రత్నంపేట తదితర గ్రామాలకు చెందిన సుమారువంద ఎడ్లబండ్లపై ఇసుకను తరలిస్తున్నారు. అలాగే చోద్యం బొడ్డేరు గెడ్డ, కొయ్యూరు మండలం రామ్‌నగర్, కొత్తూరు, కొంగసింగి తదితర వాగుల్లో రోజూ పదుల సంఖ్యలో ఎడ్లబండ్లపై ఇసుక తరలిపోతున్నది. ఒక్కో ఎడ్లబండి ఇసుక వెయ్యి రూపాయాల చొప్పున అమ్మకాలు సాగిస్తున్నారు. మండలంలో ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చెట్లు కూలితే.. పెద్ద నష్టమే

▸ ముందస్తు చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు



గ్రంథాలయం వద్ద ఓ పక్కకు ఒరిగిన చెట్టు

కృష్ణాదేవిపేట ఆగస్టు 11 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామ రాజు మైత్రి గ్రంథాలయం వద్ద ఓ భారీ వృక్షం 33 కేవీ విద్యుత్ వైర్లపై కూలేందుకు సిద్ధంగా ఉంది. దీని గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏదో సమయంలో ఈ భారీ వృక్షం కూలితే తీవ్ర నష్టం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ భారీ వృక్షం పక్క నుంచి జీసీసీ గోదాంకు సరుకులు సరఫరాలో భాగంగా నిరంతరం లారీలు, ఇతర వాహనాలు ప్రధాన రహదారిపై తిరుగుతుంటాయి. అలాగే గ్రంథాలయానికి నిత్యం పదులు సంఖ్యలో హైస్కూల్, కళాశాల విద్యార్థులు, నిరుద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ వృక్షం వల్ల ప్రమాదం సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఆలయంలో పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

మాడుగుల, ఆగస్టు 11 : మాడుగుల మోదకొండమ్మ అమ్మవారికి ఆదివారం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రాగా, మరికొంతమంది భక్తులు అమ్మవారి ఘటాల పండుగని నిర్వహించి నెత్తిన ఘటాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కొందరు భక్తులు ఆలయ వంట షెడ్లు, పంటపొలాల్లో వంటావార్పులు చేసుకొని భోజనాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇనాం భూముల సమస్యలు పరిష్కరించాలి



జనసేన కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న నరసింగరావు

గొలుగొండ, ఆగస్టు 11 : ఇనాం భూముల సమస్యలు పరిష్కరించాలని గొలుగొండ మండలం కొత్తఎల్లవరం గ్రామ జనసేన నాయకుడు పీవీ నరసింగరావు కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని కొత్తఎల్లవరం, జమ్మవరం, కశిమి రెవెన్యూ గ్రామాల్లో ఏడు వందల ఎకరాలు ఇనాం భూములుగా రికార్డులో నమోదయ్యాయన్నారు. దీనికి స్థానికులు సుమారు యాభై ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నప్పటికీ, ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ సాగు హక్కు కల్పించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. దీంతో ఉన్నతాధికారులు, జనసేన నాయకులు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ప్రకటనలకే పరిమితమైన డిగ్రీ కళాశాల

▸ పదేళ్లుగా కార్యరూపం దాల్చని వైనం
▸ కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు



డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఆర్‌జెడీ గంగేశ్వరరావు (ఫైల్‌ఫోటో)

బుచ్చెయ్యపేట, ఆగస్టు 11 : కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో వడ్డాదిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆశలు చిగురిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ కళాశాల మంజూరవగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల మండలాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 'అందని ద్రాక్ష'గానే మిగిలింది. దీంతో చాలామంది విద్యార్థులు వ్యయ ప్రయాసలకు ఓర్చి దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక ఇంటర్‌తోనే సరిపెట్టుకుంటున్నారు. ముఖ్యంగా విద్యార్థినులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. 2014లో ఎమ్మెల్యే రాజు అప్పటి సీఎం ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బుచ్చెయ్యపేటకు డిగ్రీ కళాశాల మంజూరయ్యేలా కృషి చేశారు. దీంతో 2014, నవంబరులో అప్పటి ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) గంగేశ్వరరావు వడ్డాదిలో డిగ్రీ కళాశాలను స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చారు అప్పటి ఎంపీపీ బత్తుల తాతయ్యబాబుతో కలసి భవనాన్ని పరిశీలించారు. అప్పటి డీవైఈవో పి.తిరుపతిరావతో డిగ్రీ కళాశాల ఏర్పాటుపై చేపట్టవలసిన చర్యలను సమీక్షించారు. ఇంటర్ భవనంలో సింగిల్ సెషన్‌లో ఇంటర్, డిగ్రీ కళాశాలను నిర్వహించాలని నిర్ణయించారు. టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బందిని నియామకానికి కూడా చర్యలు చేపట్టామని ఆర్‌జెడీ గంగేశ్వరరావు వెల్లడించారు. దీంతో బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగల మండలాలకు చెందిన గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్య అందుబాటులోనికి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు.

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం బుచ్చెయ్యపేటలో డిగ్రీ కళాశాలను మంజూరు చేసింది. అది కార్యరూపం దాల్చలేదు. అనంతరం వైసీపీ హయాంలో అసలు దీని సంగతే పట్టించుకోలేదు. సుమారు పదేళ్లు గడిచినా బుచ్చెయ్యపేట మాత్రం డిగ్రీ కళాశాల అందుబాటులోకి రాలేదు. కనీసం కూటమి ప్రభుత్వ హయాంలోనైనా ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు కావాలని మూడు మండలాల ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

బడికెలా వెళ్లేది సారూ..!

అధ్వానంగా బీఎస్ పేట పాఠశాల రోడ్డు



మండలంలోని బీఎస్‌పేటలో పాఠశాల రోడ్డు అధ్వానంగా తయారైంది. మట్టి కావడంతో ఇటీవల వర్షాలు కురవడంతో బురదగా తయారై నడవడానికి వీలు లేకుండా మారిపోయింది. దీంతో పాఠశాలకు వెళ్లాలంటేనే విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పొడవునా గోతులు ఏర్పడడంతో వర్షం నీరు చేరింది. ఆ రోడ్డులో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో వర్షం రోడ్డంతా నీరు చేరి బురదగా మారుతోంది. అడుగు తీసి అడుగు పెట్టలేని దుస్థితికి రోడ్డు చేరింది. ఎన్నిసార్లు మరమ్మతులు చేయమని వినతులు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- మాకవరపాలెం



సచివాలయం సమీపంలో ఉన్న చెత్తకుప్పలు తరలిస్తున్న దృశ్యం

చెత్తకుప్పలు తరలింపు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 11 : గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో నెలలు తరబడి పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'చోద్యం చూస్తున్నారా?' శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు వెంటనే చెత్త కుప్పల తరలింపునకు చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి రమణ దగ్గరుండి బ్లేడ్ ట్రాక్టర్‌తో సచివాలయం, హైస్కూల్ రోడ్డు పక్కనే ఉన్న భారీ చెత్త కుప్పలను తొలగించి పరిసరాల్లో శుభ్రత చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చెత్తకుప్పలు తొలగించిన రోడ్డు

వీఎస్ఆర్ సంస్థ సేవలు



పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న సత్యారావు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 11 : బుచ్చెయ్యపేటలోని పేదపిల్లలను వీఎస్ఆర్ సంస్థ ఆదుకుంటోంది. ప్రతీ ఆదివారం పేద పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో సంస్థ కార్యదర్శి ఒడ్డి సత్యారావు స్థానిక రామాలయంలో పిల్లలకు భోజనాలు వడ్డించారు. ఆనంతరం రామాలయం ఆవరణలో చెట్లు నాటారు. ఈ సంస్థ సేవలను స్థానికులు అభినందిస్తున్నారు.

సంపద కేంద్రాల దశ తిరిగేనా?

... 3వ పేజీ తరువాయి

గత ఐదేళ్లలో కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో నిర్మాణాలు పూర్తయిన సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మేజరు పంచాయతీ తుమ్మపాలలో చెత్తను పొడి చేసే యంత్రాలు సైతం మూలకు చేరి తుప్పు పట్టిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం రావడంతో సంపద కేంద్రాలకు ఊపిరి పోసినట్టయింది. నిర్మాణాలు పూర్తయిన సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం మార్టూరు, మామిడిపాలెం, పిసినికాడ, శంకరం పంచాయతీల్లో గల సంపద కేంద్రాలు నిర్వహణలో ఉండగా, మిగతా సంపద కేంద్రాలు కూడా అందుబాటులోకి రానున్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామాలు పరిశుభ్రంగా మారడంతో పాటు చెత్త నుంచి సంపద ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని పంచాయతీ అధికారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద అపరిశుభ్రత

నాతవరం, ఆగస్టు 11 : మండల కేంద్రం నాతవరం అంగన్‌వాడీ కేంద్రం-2 వద్ద పారిశుధ్య అధ్వానంగా ఉండటంతో ఇక్కడ విద్యాబుద్ధులు నేర్చుకునే చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న చెత్తచెదారం కుళ్లి దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో చిన్నారులు పౌష్టికాహారం తీసుకునేటప్పుడు చాలా ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాతవరం అంగన్‌వాడీ కేంద్రం-2 వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అంగన్వాడీ కేంద్రం-2 వద్ద పడి ఉన్న చెత్తాచెదారం

'హర్ ఘర్ తిరంగా' జయప్రదం చేయాలి

▸ బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న రమణమూర్తి

బుచ్చెయ్యపేట, ఆగస్టు 11 : స్వాతంత్ర దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో హర్ ఘర్ తిరంగా కార్యకమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కందర్ప రమణమూర్తి కోరారు. ఆయన ఆదివారం వడ్డాది ఎన్టీఎస్‌లో జరిగిన బీజేపీ మండల పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా ప్రచారాన్ని చిరస్మరణీయ ప్రజా ఉద్యమంగా మార్చాలన్నారు. ప్రతి ఒక్కరూ తన ప్రొఫైల్ చిత్రాన్ని కూడా జాతీయ జెండాతో భర్తీ చేయాలన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం, మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల వద్ద పరిశుభ్రం చేసి, పూలమాలలు వేసి వారికి నివాళులు అర్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 'అమ్మకు వందనం' పేరుతో ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి, ఆ నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు.జాతీయ జెండాలతో బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దూది రాజేష్, సీతా నాగరాజు, రామరాజు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వాడుకున్నారు.. వదిలేసి వెళ్లిపోయారు

▸ రోడ్డు పక్కన కాంక్రీట్ మిక్సర్ యంత్రంతో తరచూ ప్రమాదాలు

చోడవరం, ఆగస్టు 11 : స్థానిక కో-ఆపరేటివ్ కాలనీ గాంధీ పార్కు వద్ద ఓ భవన నిర్మాణం కోసం తెచ్చిన కాంక్రీటు మిక్సర్ మిషన్‌ను రోడ్డు పక్కనే వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు అంటున్నారు. పార్కు సమీపంలో భవన నిర్మాణం కోసం తెచ్చిన ఈ మిషన్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోవడంతో ఇది రోడ్డుపక్కన ఇబ్బందికరంగా మారింది. ఈ యంత్రం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో రాత్రివేళల్లో ఈ మిషన్ కనిపించకపోవడంతో వాహనదారులు దీన్ని ఢీకొట్టి గాయాలపాలవుతున్నారు. ఇటీవల ఇక్కడ తరచూ ఇదే తరహా ప్రమాదాలు సంభవించాయి. ఈ యంత్రాన్ని ఇక్కడ నుంచి తొలగించాలంటూ స్థానికులు పలుమార్లు పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పక్కన ఉన్న ఈ యంత్రాన్ని తొలగించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కన వదిలేసిన యంత్రం

రోలుగుంటలో 70 శాతం వరినాట్లు పూర్తి



వరినాట్లు పూర్తయిన పొలాలు

రోలుగుంట, ఆగస్టు 11 : మండలంలోని 70 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని 1450 హెక్టార్ల లక్ష్యం కాగా, అందులో 70 శాతం వరినాట్లు పూర్తయినట్లు తెలిపారు. ఈ ఖరీఫ్‌కు సంబంధించి సకాలంలోనే నాట్లు పడ్డాయన్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో వేసిన నాట్లుకు నీటి ఇబ్బంది లేదన్నారు. రైతులకు సకాలంలో ఆర్‌బీకేల ద్వారా ఎరువులు అందించినట్టు చెప్పారు. అలాగే ఈ ఖరీఫ్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుందన్నారు. వచ్చే నెల 15లోగా ప్రతీ రైతు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు.

రియల్టర్ల ఇష్టారాజ్యం

... 3వ పేజీ తరువాయి

పాస్ పుస్తకాల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

నోటీసులతో సరిపెడుతున్నారు

జిల్లాలో అక్రమ లేఅవుట్ల వ్యవహారంపై ఎవరైనా పంచాయతీ, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదులు చేస్తే సంబంధిత రియల్ వ్యాపారికి ఒక నోటీసు జారీచేసి మమా అనిపిస్తున్నారు. ఇటీవల అనకాపల్లి నియోజకవర్గం బయ్యవరం రెవెన్యూ విస్సన్నపేటలో అక్రమ లేఅవుట్ వ్యవహారాన్ని వీఎంఆర్‌డీఏ అధికారులకు జనసేన నాయకులు ఫిర్యాదు చేస్తే కేవలం నోటీసు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికే ప్లాట్‌ల విక్రయాలు జరిగిపోయినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. కొండకొప్పాక రైల్వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారికి చెందిన సర్వీసు రోడ్డును అనకాపల్లికి చెందిన ఒక రియల్టరు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సుమారు వంద ఎకరాల్లో వేస్తున్న ఈ లేవుట్‌కు నాలా ఫీజు పైసా చెల్లించలేదని తెలిసింది. ఇదే లేఅవుట్‌లో సింహాద్రి పవర్ ప్రాజెక్టుకు చెందిన హైటెన్షన్ విద్యుత్ టవర్లకు సమీపంలో తీగల కింద నిబంధనలకు విరుద్ధంగా లేవుట్ పనులు జరుపుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు జిల్లాలో అనధికార లేఅవుటపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 11 : కేరళ వయనాడ్ బాధితుల కోసం ఆదివారం సీపీఎం నాయకులు విరాళాలు సేకరించారు. బంగారుమెట్ట, ఎల్‌బీపీ అగ్రహారం, వడ్డాది గ్రామాల్లో సీపీఎం చోడవరం డివిజన్ నాయకుడు పినపాత్రుని సాంబశివరావు తదితరులు విరాళాలు సేకరించారు. మండల వ్యాప్తంగా సేకరించిన విరాళాలు సీపీఎం అధిష్టానం ద్వారా వయనాడ్ బాధితులకు పంపించనున్నట్టు సాంబశివరావు తెలిపారు.

లీకేజీలను అరికట్టరేం?



పైపులైన్ లీకేజీలో రోడ్డుపై చేరిన నీరు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 11 : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో పైపులైన్లు లీక్ అవడంతో తాగునీరు వృథాగా పోతోంది. లీక్ అయిన పంపులైన్ల మరమ్మతుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా లీక్ అవుతున్న నీరు రోడ్లపై పారుతుండడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారుతోంది. ఏఎల్‌పురం కొంగసింగి రహదారి, బీసీ కాలనీకి వెళ్ళే రహదారిలో నెలల తరబడి ఇదే పరిస్థితి నెలకొంది. రోడ్డుపై లీకేజీ నీరు ఉండడంతో వాహనాలు వచ్చే సమయంలో ఇబ్బందిగా ఉంటుందని పాదచారులు అంటున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

78 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామచంద్రరావు

దేవరాపల్లి, ఆగస్టు 11 : మండలంలోని వాలాబులో సంఘ మిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, బుజ్జి ప్రారంభించారు. వాలాబుతో పాటు వివిధ గిరిజన గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అధిక సంఖ్య ప్రజలు వైద్య శిబిరానికి వచ్చారు. చెవి, గొంతు, ముక్కు వైద్య నిపుణులు బండారు రామచంద్రరావు నేతృత్వంలో 78 మందికి వైద్యం చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు మెరుగైన వైద్యం కోసం విశాఖ వస్తే ఉచితంగా వైద్యం చేయిస్తానన్నారు. వైద్యులు సందీప్, శ్రీచక్ర, అనూష, నిహారిక, అమ్మచారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ వెకంటరావు, దేవరాపల్లి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకర్

నర్సీపట్నం, ఆగస్టు 11 : స్థానిక డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యులకు విశాఖపట్నంకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీకర్ వైద్య పరీక్షలు చేశారు. పలువురు క్లబ్ సభ్యులకు కార్డియోగ్రఫీ టెక్నిషియన్ సాయి టుడి ఎకో పరీక్షలు చేశారు. అనంతరం కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీకర్ బీపీ, ఈసీజీ, టుడీ ఎకో, రక్త పరీక్షల రిపోర్ట్స్ పరిశీలించి ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ శరీరానికి వ్యాయామం, ఆహార నియమాలు పాటించక పోవడం వంటి కారణాలతో గుండు జబ్బు రోగులు పెరిగి పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీకాంత్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తుప్పలు



మంచాల-గుంటుకొత్తూరు రోడ్డులో గుబురుగా పెరిగిన తుప్పలు

చీడికాడ, జూలై 14 : మండలంలో మంచాల నుంచి గుంటు కొత్తూరు వెళ్లే తారురోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చీడికాడ నుంచి మంచాల మీదుగా కోనాం వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో రోజూ వాహనాలు, లారీలు అధికంగా తిరుగుతుంటాయి. ఆర్ అండ్ బీ నిర్వహణలో ఉన్న ఈ రోడ్డులో తుప్పలు పెరిగిపోవడంతో పాటు మలుపులు అధికంగా ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించే అవకాశమే లేకుండా పోతోందని, దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తుప్పలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.